సాక్షి వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం । 29 । ఆగస్టు । 2025



భాషా సాహితీ రంగాల్లో జిల్లాపై వివక్ష

తొలి తెలుగు శాసనం లభించిన జిల్లాపై పాలకులు వివక్ష ప్రదర్శిస్తున్నారు. ఇక్కడి వారికి సరైన గుర్తింపు ఇవ్వక అన్యాయం చేస్తున్నారు. -8లో



జీవశాస్త్రంపై అంతర్జాతీయ సదస్సు

కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో సమగ్ర జీవశాస్త్రం , ఔషధ శాస్త్రంపై గురువారం అంతర్జాతీయ సదస్సు జరిగింది. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0/25.0

జిల్లాలో గురువారం 25.0 - 34.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

మహా గణపతిం.. మనసాస్మరామి!



కడప అక్కాయపల్లెలో శివలింగాకారంలో వినాయక మండపం



కడప ఎస్ఎఫ్ వీధిలో శనగల ఆకారంలో ..



బొప్పాయి పండులో లంబోదర రూపం



ప్రొద్దుటూరులో మోడంపల్లెలో పేపర్ పేస్టుతో చేసిన గణపతి



కడప ఎన్జీవో కాలనీలో గణనాథున్ని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



కడప రాజీవ్ మార్గ్‌లో భారీ వినాయకుడు

ఊరూరా కొలువుదీరిన గణనాథుడు ఘనంగా పూజలందుకున్నాడు. బుధవారం ఉదయం నుంచి మొదలైన చవితి సంబరాలు అంబరాన్నంటాయి. ఏకదంతుడు.. బహురూపాల్లో కనువిందు చేశాడు. జిల్లా వ్యాప్తంగా వినాయక మండపాలు భక్తులతో కళకళలాడాయి.

- ఘనంగా చవితి వేడుకలు
- తిరునాళ్లను తలపించిన భక్తజనం

కడప సెవెన్‌రోడ్స్: విఘ్నాలు తొలగించి సర్వ శుభాలను ప్రసాదించే గణనాథుని చవితి వేడుకలు బుధ, గురువారాల్లో జిల్లా ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా విగ్రహాలుగల పందిళ్లన్నీ ఉదయం, సాయంత్రం భక్తజనంతో పోటెత్తాయి. పిల్లలు, పెద్దలు నిలువెత్తు గణపతి మూర్తులను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కుటుంబాలతోసహా ఉదయం, సాయంత్రం సమీపంలోని వీలైనన్ని పందిళ్లలోని స్వామిని దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా దర్శన ఏర్పాట్లు చేశారు. రాత్రి పౌరాణిక, భక్తి నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

గణేష్ నిమజ్జనానికి పటిష్ట భద్రత: ఎస్పీ

కడప అర్బన్: జిల్లాలో గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పోలీస్ శాఖ పటిష్ట భద్రత చర్యలు చేపట్టిందని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జిల్లాలో పోలీస్ శాఖ రూపొందించిన ఉత్సవ్ యాప్ ద్వారా 4500 విగ్రహాలను ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ప్రాంతాల వారీగా విగ్రహాల వద్ద గస్తీ కోసం పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశామని వివరించారు. విగ్రహాల నిమజ్జనం జరిగే ప్రదేశాలు కూడా వివిధ శాఖలతో అధికారులతో కలిసి గుర్తించామని పేర్కొన్నారు.

- జిల్లాలో వినాయక చవితి పండుగ రోజునే నిమజ్జన కార్యక్రమం ప్రారంభమైంది. ప్రశాంతంగా విగ్రహాలు నిమజ్జనం చేస్తున్నారని, ముఖ్యంగా మూడవ రోజు శుక్రవారం సుమారు 1600, ఐదవ రోజు అయిన 31న 1550 విగ్రహాలు నిమజ్జనం జరగనున్నాయని వెల్లడించారు. ఈ విషయమై పోలీస్ శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. వినాయక నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు ఉత్సవ కమిటీల నిర్వాహకులు, పీస్ కమిటీలు సంయుక్తంగా కృషి చేయాలన్నారు. అసాంఘిక శక్తులు, అల్లరిమూకలపై నిఘా ఉంచామని.. తేడా చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కడప ఎన్జీవో కాలనీలో ఆకట్టుకున్న సెట్టింగ్



ముద్దనూరు: చేతిలో వేణువుతో శ్రీకృష్ణుడిగా వినాయకుడు

మండపాల వద్ద జాగ్రత్తలు తప్పనిసరి

- వర్షాల్లో అతుకులు పడ్డ వైర్లు మరింత ప్రమాదకరం
- జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్.రమణ

కడప కార్పొరేషన్: వర్షాలు పడుతున్న నేపథ్యంలో వినాయక మండపాల వద్ద విద్యుత్‌పై తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యుత్ మండపాల వద్ద లైటింగ్ అలంకరణ నిర్మాణాలకు, సౌండ్ సిస్టంకు, విద్యుత్ ఉపకరణాలకు ఉపయోగించే వైర్లు నాణ్యమైనవిగా ఉండాలన్నారు. వర్షాలకు భూమిపై తేమ ఉండడం వల్ల చిన్నపాటి అతుకుల ద్వారా పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, అతుకులు లేని నాణ్యమైన వైర్లు ఉపయోగించి విద్యుత్ ప్రమాదాలను నివారించాలని సూచించారు. భారీ, ఎత్తైన విగ్రహాల ఊరేగింపుల సమయాలు, ఊరేగింపు మార్గాన్ని స్థానిక విద్యుత్ కార్యాలయాల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు దీనిపై చొరవ చూపాలని కోరారు.



విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

వినాయక చవితి పండుగ నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలు జరగడానికి ఆస్కారమున్నా, ప్రమాదాలు జరిగినా తక్షణం స్పందించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కడప విద్యుత్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిసేవ్యానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. వినాయక మండపాల నిర్వాహకులు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఏదైనా ప్రమాదం జరిగిన వెంటనే సంబంధిత విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్ నెంబర్- 9440817440కు ఫోన్ చేయాలన్నారు. అలాగే విద్యుత్ శాఖ వాట్సాప్ నెంబరునకు 9440814264 మెసేజ్ పెట్టాలన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 1912 నకు కూడా తెలియజేయవచ్చని తెలిపారు.





కడప బెల్లంమండివీధిలో కల్యాణోత్సవంలో స్వామివారు, సిద్ధి, బుద్ధి అమ్మవార్లను ఎదుర్కోలు ఉత్సవానికి తీసుకొస్తున్న దృశ్యం



ప్రొద్దుటూరులో 1116 దీపాలతో గణనాథుడి ఆకృతి



మైదుకూరులో వ్యాస మహర్షి, లంబోదరుడి మట్టి విగ్రహాలు

న్యూస్‌రీల్

నేడు బహుమతుల ప్రదానం

కడప వైఎస్ఆర్ సర్కిల్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా అమరావతి చాంపియన్ షిప్ రాష్ట్ర స్థాయి విజేతలకు శుక్రవారం విశాఖ పట్నంలో బహుమతుల ప్రదానోత్సవం జరుగుతోందని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జగన్నాథ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ జిల్లా నుంచి పలువురు విజేతలుగా నిలిచారని పేర్కొన్నారు.

రేపు జెడ్పీ సర్వసభ్య సమావేశం

కడప సెవెన్‌రోడ్స్: జెడ్పీ సభా భవనంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ఓబులమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి అధికారులు తగిన సమాచారంతో రావాలన్నారు.గౌరవ సభ్యులు గుర్తింపు కార్డుతో హాజరు కావాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా ఉమైర్



కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లా కడప నగరానికి చెందిన షేక్ ఉమైర్‌ను రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఉమైర్ మాట్లాడుతూ తాను పార్టీకి చేసిన సేవలను గుర్తించి పదవి ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పదవి రావడానికి సహకరించిన ఎంపీ అవినాష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నియామకాలు

జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమిస్తూ వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాల యం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శిగా షేక్ షాహీదుల్లా(జమ్మలమడుగు), మైనార్టీ సెల్ కార్యదర్శిగా సయ్యద్ పీరాన్(మున్నా), మేధావుల ఫోరం అధికార ప్రతినిధిగా పి. క్రిష్ణమూర్తి(కడప)లను నియమించారు.

వెల్లివిరిసిన సేవాభావం



కడప జెడ్పీ కార్యాలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఎంపీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



పులివెందులలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్ మనోహర్ రెడ్డి తదితరులు

కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ శ్రేణులు, ఆయన అభిమానులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానాలు, పేదలకు దుస్తుల పంపిణీ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కడపలో జరిగిన వేడుకల్లో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. పులివెందులలో వైఎస్ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. – కడప కార్పొరేషన్/ పులివెందుల

భక్తుల పాలిట కొంగుబంగారం ఆరోగ్యమాత

- నేటి నుంచి తిరుణాల

కడప సెవెన్‌రోడ్స్ : కడప రైల్వేస్టేషన్ సమీపంలో వెలిసిన ఆరోగ్యమాత భక్తుల పాలిట కొంగుబంగారంగా అలరారుతోంది. నగరంలోని ప్రముఖ క్రైస్తవ మందిరాలలో ఇదొకటి. బ్రిటీషు పాలనలో నిర్మించిన ఈ చర్చి కాలక్రమంలో పెద్ద చర్చిగా వెలిసింది. ఇటీవల ఆ ప్రాంగణంలో అధునాతనంగా మరో పెద్ద చర్చిని నిర్మించారు. అర్ధ చంద్రాకారంలో రెండు అంతస్తులుగా రూపుదిద్దుకున్న ఈ చర్చిలో ఒక్కొక్క అంతస్తులో 1200 మందికి చొప్పున ఒకేసారి ప్రార్థనలు చేసుకునే వీలుంది. భక్తులు ఆరోగ్యమాత పుణ్యక్షేత్రాన్ని కడప వేలాంగిణిగా భావిస్తారు. ఏటా ఆరోగ్యమాత తిరునాల మహోత్సవాన్ని పది రోజులపాటు ఎంతో ఘనంగా నిర్వహిస్తారు.

నేటి నుంచి ఉత్సవాలు

ఆరోగ్యమాత ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 5.00 గంటలకు పతాకావిష్కరణ, నవదిన ప్రారంభ వేడుకలు, దివ్య బలిపూజ నిర్వహించనున్నారు. కడప పీఠాధిపతి సగినాల పాల్ ప్రకాశ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. అలాగే సెప్టెంబరు 7, 8 తేదీల్లో తిరునాల మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. 8వ తేది ఉదయం 8.30 గంటలకు విశాఖపట్టణం అగ్రపీఠం విశ్రాంత అగ్రపీఠాధిపతులు మల్లవరపు ప్రకాశ్ ఆధ్వర్యంలో మహోత్సవ సమిష్టి దివ్య బలిపూజ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలు ముగిసే వరకు ప్రతిరోజు వివిధ ప్రాంతాలకు చెందిన మత పెద్దలు దైవ సందేశాన్ని అందజేయనున్నారు.



విద్యుద్దీప వెలుగుల్లో ఆరోగ్యమాత చర్చి

సెప్టెంబరు 11, 12వ తేదీల్లో కళా ఉత్సవ్

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా స్థాయి కళా ఉత్సవ్ – 2025 పోటీలు సెప్టెంబర్ 11, 12 తేదీల్లో రాయచోటి డైట్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు అన్నమయ్య, కడప జిల్లాల విద్యాశాఖాధికారులు సుబ్రహ్మణ్యం, షంషుద్దీన్ తెలిపారు. గురువారం కడప డీఈవో కార్యాలయంలో కళా ఉత్సవ్ – 2025 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం , నృత్యం, నాటకం, దృశ్యకళలు, సాంప్రదాయ కథ చెప్పడం వంటి 6 విభాగాలలో 12 అంశాల్లో పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులలో సృజనాత్మకత, కళాత్మక నైపుణ్యాలను పెంపొందించడం, కళల ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించేందుకు విద్యార్థులకు వేదికను అందించడం ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు పోటీలకు అర్హులని వివరించారు. వివరాల కోసం కళా ఉత్సవ్ జిల్లా నోడల్ అధికారి నరసింహారెడ్డి 9440246825ని సంప్రదించాలని సూచించారు.



కళా ఉత్సవ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అన్నమయ్య, కడప జిల్లాల డీఈఓ తదితరులు

వైవీయూలో నృత్య, సంగీత కోర్సులలో ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వ విద్యాలయంలోని లలిత కళలశాఖ ఆధ్వర్యంలో కూచిపూడి, కర్నాటక సంగీతం, కీబోర్డు, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలను ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభించినట్లు డైరక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మిప్రసాద్ తెలిపారు. ప్రవేశాల ప్రక్రియ సెప్టెంబర్ 12 వరకు కొనసాగుతుందన్నారు. పదేళ్లు నిండిన వారి నుంచి తర్వాత ఏ వయసు వారైనా ఈ కోర్సుల్లో చేరవచ్చని పేర్కొన్నారు. వివరాలకు www.edu.in ను సంప్రదించాలని సూచించారు. అలానే 9032595101 నెంబరుకు సంప్రదించాలన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఉద్యోగులు, కళాకారులు ప్రవేశాలు పొందవచ్చని, తరగతులు సాయంత్రం సమయంలో ఉంటాయని వివరించారు.

ప్రశాంతంగా సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్ల పరిశీలనకు వచ్చిన ఎంపికైన అభ్యర్థులు



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్సీ స్టేట్ అబ్జర్వర్

కడప ఎడ్యుకేషన్: డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం నిర్వహించారు. కడపలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి విద్యాశాఖ 17 టీమ్స్‌తోపాటు 30 మంది వలంటీర్లను ఏర్పాటు చేసింది.

జిల్లావ్యాప్తంగా డీఎస్సీ లాగిన్ ఐడీ ద్వారా కాల్ లెటర్స్ అందుకున్న 609 మంది అభ్యర్థులు పరిశీలన కేంద్రానికి చేరుకున్నారు. పత్రాల పరిశీలన ఉదయం 8 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా.. ఆన్‌లైన్‌లో అభ్యర్థుల కుల ధ్రువీకరణ, టెట్ మార్కులకు సంబంధించి లాగిన్‌లో కనిపించకపోవడంతో సర్టిఫికెట్ల పరిశీలన ఆలస్యమైంది. దీంతో పత్రాల పరిశీలన బాగా పొద్దుపోయేదాకా జరిగింది. రాత్రి పూట పరిశీలన కేంద్రంలో సరైన లైటింగ్ వసతి లేక తీవ్ర ఇబ్బందులకు గురైనట్లు పలువురు అభ్యర్థులు తెలిపారు.

పరిశీలన కేంద్రాన్ని పరిశీలించిన డీఈఓ, స్టేట్ అబ్జర్వర్లు..

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాన్ని డీఈఓ షేక్ షంషుద్దీన్‌తో కలిసి డీఎస్సీ స్టేట్ అబ్జర్వర్ మధుసూదన్‌రావు పరిశీలించారు. సర్టిఫికెట్ల పరిశీలన ఎలా జరుగుతుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కోసం కడప కేంద్రంలో 17 టీమ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. జోనల్ పోస్టులకు సంబంధించిన అభ్యర్థులు ఏ జిల్లా నుంచి దరఖాస్తు చేసుకున్నారో ఆ జిల్లాలోనే ధ్రువ పత్రాలను పరిశీలించుకోవచ్చన్నారు. మెడికల్ గ్రౌండ్స్ ఉన్న అభ్యర్థులు కూడా సర్టిఫికెట్లు పరిశీలించుకోవచ్చని వివరించారు.

క్లుప్తంగా

కారు ఢీకొని మహిళ మృతి


మృతురాలు పల్లా రాజేశ్వరి

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని మోరగుడి గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన పల్లా రాజేశ్వరి(70) మృతి చెందారు. ఎస్‌ఐ హైమావతి వివరాల మేరకు.. మోరగుడి గ్రామానికి చెందిన పల్లా రాజేశ్వరి బుధవారం రాత్రి వినాయక విగ్రహాన్ని దర్శించుకుని తిరిగి ఇంటికి వెళ్తున్నారు. రచ్చబండ సమీపానికి చేరగానే జమ్మలమడుగు నుంచి మైలవరం వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి మహిళను ఢీకొంది. ఈ సంఘటనలో ఆమె తీవ్ర గాయాలవగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికి మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గొర్రెల చోరీ

ముద్దనూరు : మండలంలోని తిమ్మాపురం సమీపంలో ఐదో గొర్రెలు దుండగులు చోరీ చేశారు. ఎస్‌ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు.. తిమ్మాపురం గ్రామానికి చెందిన జయరాముడు సుమారు 130 జీవాలు మేపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. రాత్రి వేళల్లో వాటిని రహదారి ప్రక్కనే వున్న దొడ్డిలో వాటిని ఉంచేవాడు. మంగళవారం రాత్రి అందులోని ఐదు గొర్రెలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వాటి విలువ రూ.30వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయపడిన ప్రశాంత్

కలసపాడు : మండలంలోని గిద్దలూరు ప్రధాన రహదారిలో గంగాయపల్లె వద్ద ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి తీ వ్రగాయాలయ్యా యి. పోలీసుల వివరాల మేరకు.. గిద్దలూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ప్రశాంత్‌కుమార్ కలసపాడు నుండి తన స్వగ్రామానికి బుధవారం ద్విచక్రవాహనంలో బయలుదేరారు. గిద్దలూరు నుంచి మైదుకూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం గంగాయపల్లె వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రశాంత్‌కుమార్ తీవ్రంగా గాయపడగా, గిద్దలూరు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన వారు హాజరుకావాలి

కడప అర్బన్: కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు వైద్య పరీక్షల నిమిత్తం ఆగస్టు 30, సెప్టెంబర్ 1, 2 తేదీల్లో స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో హాజరు కావాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ తెలిపారు. ఈ నెల 30న రిజిష్టర్ నెంబర్ 4001160 నుంచి 4155879 వరకూ, సెప్టెంబర్ 1న 4156636 నుండి 4299199 వరకు సివిల్ అభ్యర్థులు, 2న 4299250 నుంచి 4504602 వరకు ఏపీఎస్పీ వారైతే 4002777 నుండి 4468576 రిజిష్టర్ నెంబర్ల వరకు హాజరు కావాలని సూచించారు.

భాషా సాహితీ రంగాల్లో జిల్లాపై వివక్ష

నేడు తెలుగు భాషా దినోత్సవం



కడప సెవెన్‌రోడ్స్ : తొలి తెలుగు శాసనం లభించిన జిల్లా కడప. తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య, తొలి తెలుగు కవయిత్రి మొల్ల, తాళ్లపాక తిమ్మక్కలకు జన్మనిచ్చిన జిల్లా. నన్నయ్య కన్న ఎంతో ముందువాడైన నన్నెచోడుడు ఈ జిల్లా వాసి. సంఘ సంస్కర్తలు వేమన, బ్రహ్మంగారు నడయాడిన జిల్లా. సీపీ బ్రౌన్ మహాశయుడు తెలుగుభాషా సాహిత్యాల సముద్ధరణ మహాయజ్ఞాన్ని సాగించింది ఇక్కడే. ఆధునిక మహాకావ్యంగా పండితులు అభివర్ణించే శివతాండవం సృష్టికర్త పుట్టపర్తి తిరుగాడిన జిల్లా కడప. మిగతా రంగాలతోపాటు భాషా సాహితీ అంశాలలో సైతం పాలకులు జిల్లా పట్ల తీవ్ర వివక్ష ప్రదర్శిస్తున్నారు. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఓమారు ఈ అంశాలను సింహావలోకనం చేసుకుంటే...

నన్నెచోడుడికి దక్కని ఆది కవి హోదా

కడప జిల్లా పొత్తపినాడుకు చెందిన కవి. కుమారసంభవం అనే కావ్యాన్ని రాశారు. కాళిదాసు రచనలోని ఇతివృత్తాన్ని మాత్రమే తీసుకుని రాశారు. తెలుగు సాహిత్య రంగంలో నన్నయ్య కన్నా ముందువాడైన నన్నెచోడుడు 925–40 మధ్యకాలం వారని తెలుస్తోంది. నన్నెచోడుడు రాసిన కుమారసంభవం కావ్యాన్ని కనుగొని పరిష్కరించి వెలుగులోకి తీసుకొచ్చిన ఘనత సుప్రసిద్ధ సాహితీ పరిశోధకుడు, కవి, సంస్కృతాంధ్ర పండితుడు, బహుభాషా కోవిదుడైన మానవల్లి రామకృష్ణ కవికి దక్కుతుంది. అప్పటి వరకూ తెలుగు సాహిత్యంలో నన్నెచోడుడు అనే కవి ఉన్నారనే విషయమే ఎవరికీ తెలియదు. తంజావూరులోని సరస్వతి మహల్ గ్రంథాలయంలో ఒక మూలపడి ఉన్న కుమారసంభవం తాళపత్ర గ్రంథాన్ని రామకృష్ణ కవి కనుగొన్నారు. దాన్ని పరిష్కరించి 1909లో ప్రకటించారు. నన్నెచోడుడు నన్నయ్య కంటే ముందువాడని శాసనాధారాలతో ప్రకటించారు. రామకృష్ణ కవి చేసిన ప్రతిపాదన పండిత లోకాన్ని ఎంతో ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ ప్రతిపాదనపై చర్చోపచర్చలు, వాదోపవాదాలు వాడిగా వేడిగా జరిగాయి. చిలుకూరి వీరభద్రరావు, వేటూరి ప్రభాకరశాస్త్రి, జయంతి రామయ్య పంతులు, పింగళి లక్ష్మీకాంతం, నిడదవోలు వెంకటరావు, ఆరుద్ర మొదలైన వారు దీన్ని వ్యతిరేకించారు. రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, పుట్టపర్తి నారాయణచార్యులు వంటివారు మానవల్లి ప్రకటనను సమర్థించారు. మల్లంపల్లె సోమశేఖరశర్మ సరసర చెప్పుకోదగ్గ ప్రముఖ శాసన పరిశోధకులు, హైదరాబాదుకు చెందిన బీఎన్ శాస్త్రి కుమార సంభవంపై పరిశోధన చేసి నన్నయ్య కన్నా నన్నెచోడుడే ముందు వాడని శాసన ఆధారంగా నిరూపించారు. కందుకూరి వీరేశలింగం రాసిన ఆంధ్ర కవుల చరిత్రలో ఈ విషయానికి సంబంధించిన శాసనం ఉందంటూ పేర్కొనడం విశేషం. నన్నెయ్యకే ఆదికవి హోదా దక్కాలనే కోస్తా ప్రాంతానికి చెందిన సాహితీవేత్తల అభిప్రాయానికే ప్రభుత్వాలు విలువనిచ్చాయి. నన్నెచోడుడికి ఆది కవి హోదా లభించక కడపజిల్లాకు తీరని అన్యాయం జరిగింది.

తెలుగు సూర్యుడు సీపీ బ్రౌన్

తెలుగు భాషా సాహిత్యాల సముద్ధరణకు జీవితాంతం అవిరళ కృషి చేసిన మహనీయుడు సీపీ.బ్రౌన్. తాళపత్ర గ్రంథాలు, కావ్యాలు, శతకాలు, వేమన పద్యాలను స్వంత ఖర్చులతో సేకరించారు. పండితులకు స్వంతంగా జీతాలు ఇచ్చి శుద్ధప్రతులను కాగితాలపై రాయించారు. కొన్నింటికి వ్యాఖ్యానాలు రాయించి ముద్రించారు. వేమన పద్యాలను ఆంగ్లంలోకి అనువదించి తెలుగు కీర్తిని విశ్వవ్యాప్తం చేశారు. తెలుగు వ్యాకరణం, నిఘంటువులు, నిత్యం పరిపాలన వ్యవహారాల్లో ఉపయోగించే రెవెన్యూ జ్యుడిషియల్ పదజాలాన్ని సేకరించి నిఘంటువు తయారు చేశారు. ఆయన కృషి లేకపోతే నేడు తెలుగు భాషా సాహిత్యాలు ఈ స్థితిలో ఉండేవి కావు. అలాంటి మహానుభావుడి గురించి పాఠ్యాంశాల్లో చేర్చకపోవడం విచారకరం. సీపీ బ్రౌన్ పేరిట కనీసం పురస్కారాలు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని ఈ ప్రాంత సాహితీవేత్తలు కోరుతున్నారు.

పుట్టపర్తికి దక్కని జ్ఞానపీఠం

శ్రీకృష్ణ దేవరాయల రాజగురువు తాతాచార్యుల వంశానికి చెందిన పుట్టపర్తి నారాయణాచార్యులు కడప నగరానికి చెందిన వారు. ఆధునిక మహాకావ్యంగా పండితులు అభివర్ణించే శివతాండవం సృష్టికర్త. జనప్రియ రామాయణం, మేఘదూతం వంటి గేయ కావ్యాలు రాశారు. అనేక భాషలు తెలిసిన వ్యక్తిగా పీవీ.నరసింహారావు పేరు మారుమోగుతోంది గానీ పుట్టపర్తి పేరు అంతగా వినిపించదు. తుళు, ఫ్రెంచ్, పర్షియన్, అవధీ, బ్రజ్, కన్నడ, మళయాళ, మరాఠి, సంస్కృతం, ఇంగ్లీషు వంటి 14 బాషల్లో పాండిత్యం సాధించిన దిట్ట పుట్టపర్తి. వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, శ్రీకృష్ణ దేవరాయల విశ్వవిద్యాలయం ఆయనకు డీలిట్ ప్రదానం చేశాయి. భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని అందించింది. నిజానికి ఆయన జ్ఞానపీఠ అవార్డుకు అర్హులు. పుట్టపర్తి ఏ కోస్తా జిల్లాలోనో జన్మించి ఉంటే ఆయన్ను ఏనాడో జ్ఞానపీఠం వరించేదని పలువురు సాహితీవేత్తల అభిప్రాయం.

పురస్కారాల్లోనూ వివక్షే

తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమ పితామహులైన గిడుగు రామ్మూర్తి పంతుల జయంతిని ప్రభుత్వం తెలుగు భాషా దినోత్సవంగా పాటిస్తోంది. భాషా సాహిత్యాలకు విశేష కృషి చేసిన పలువురికీ ఈ సందర్భంగా పురస్కారాలు అందించి గౌరవించడం చాలా కాలంగా వస్తోంది. గతేడాది నిర్వహించిన పురస్కారాల్లో జిల్లా విషయంలో ఆ మాటకొస్తే రాయలసీమ పట్ల వివక్షే ప్రదర్శించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గతంలో పురస్కారాలు పొందిన ఇద్దరికి పురస్కారాలు అందించి చేతులు దులుపుకొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రాంతీయ సమతుల్యత పాటించలేదనే విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇది పూర్తిగా బాధ్యతా రాహిత్యమని, ప్రాంతాల మధ్య విభేధాలు పెరిగేందుకు దోహదం చేస్తుందని ఇక్కడి సాహితీవేత్తలు పేర్కొన్నారు. కానీ ప్రభుత్వం ఓట్ల రాజకీయాలకు పెద్దపీట వేస్తోందన్న విమర్శలు ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇప్పటికైనా జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాలని పలువురు కోరుతున్నారు.

సీమపై వివక్ష తగదు



నన్నెచోడుడు నన్నయ్య కన్నా ముందువాడనే వాదనపై ప్రభుత్వం ఒక నిపుణుల కమిటీ నియమించి నిగ్గుతేల్చాలి. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని కేంద్ర స్థానంగా చేసుకోవాలి. అన్నమయ్యలోని సంఘ సంస్కరణ భావాలు, ఆయన పద ప్రయోగాలు, తిరుగాడిన స్థలాలు పరిశోధించడానికి ఒక ప్రత్యేక సంస్థ ఏర్పాటుచేయాలి. నాచన సోముని వంటి అనేక మంది రాయలసీమ కవులకు గుర్తింపు లేకుండాపోయింది. వేమన, పోతులూరి వీరబ్రహ్మం ప్రాచీన కాలంలో సంఘ సంస్కరణ కవులు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో వీరి సాహిత్యం మీద పరిశోధనలను ప్రోత్సహించాలి. కట్టమంచి, పుట్టపర్తి లాంటి వారికి ఏమాత్రం గుర్తింపులేకుండా పోయింది. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని రాయలసీమలోనే గొప్ప పరిశోధన కేంద్రంగా అభివృద్ధి చేయాలి. భాషా పరిశోధకులు, నిఘంటువు నిర్మాతలు, కావ్య పరిష్కర్తలు, వ్యాఖ్యాతలకు సీపీ బ్రౌన్ పేరిట పురస్కారాలు అందించాలి. తొలి తెలుగు కవయిత్రి మొల్ల, తాళ్లపాక తిమ్మక్క, తరిగొండ వెంబమాంబలకు గుర్తింపు వచ్చేటట్లు పరిశోధనలు ప్రోత్సహించాలి.

– రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, అధికారభాషా సంఘం మాజీ సభ్యులు

భాషను బ్రతికించుకోవాలి



మాతృభాష తెలుగును ఆంగ్ల బారి నుంచి రక్షించుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. విద్య వ్యాపారంగా మారిన పరిస్థితుల్లో తెలుగుభాష చీకటి కోణాల్లోకి వెళ్లిపోతోంది. పాఠశాల స్థాయి నుంచి స్నాతకోత్తర స్థాయి వరకు ప్రతిచోట నిర్లక్ష్య ధోరణి పెరగడం ఆందోళన కలిగిస్తోంది. నన్నయ్య నుంచి నేటి వరకు తెలుగుభాష పలు మార్పులకు లోనై గిడుగు రామ్మూర్తి వ్యవహారిక భాషోద్యమంతో తెలుగు పండిత భాష నుంచి ప్రజల భాషకు చేరింది. భాషను మనం బ్రతికించుకోకపోతే మన సంస్కృతికి మనమే దూరమవుతున్నట్లు లెక్క.

– డాక్టర్ పొదిలి నాగరాజు, తెలుగు అధ్యాపకులు, కడప

క్వాంటం టెక్నాలజీతో నైపుణ్యాభివృద్ధి


మాట్లాడుతున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా

వేంపల్లె : క్వాంటం టెక్నాలజీతో మరింత నైపుణ్యాభివృద్ధి సాధించవచ్చునని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా అన్నారు. అమరావతి క్వాంటం వ్యాలీ – 2025 హ్యాకథాన్‌లో భాగంగా ఆర్జీయూకేటీ పరిధిలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో బుధవారం ఏర్పాటుచేసిన ఇంటర్నల్ హ్యాక్‌థాన్‌కు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా డైరెక్టర్ కుమారస్వామి గుప్తా మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న టెక్నాలజీతో సాధ్యంకాని సమస్యలను క్వాంటం టెక్నాలజీతో సాధించవచ్చునన్నారు. అమరావతిలో 156 క్యూ–బిట్‌లతో ఐబీఎంతో కంపెనీ వారు క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నారన్నారు. ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ నుంచి విద్యార్థులు ఈ ఇంటర్నల్ హ్యాక్ థాన్‌లో పాల్గొని సమాజానికి అవసరమైన సమస్యలకు పరిష్కార మార్గాలను వెతకాలన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలు అమరావతి క్వాంటం వ్యాలీలో సెప్టెంబర్ నెలలో జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, రమేష్ కైలాస్, కొండారెడ్డి, రత్నకుమారి, వెంకటేష్, అరుణ్ కుమార్, రమేష్, సుధాకర్‌రెడ్డి, భాస్కరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సాహసవీరుడికి సత్కారం


రమణారెడ్డిని సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

పోరుమామిళ్ల : పాకిస్తాన్ చెర నుంచి ఏడుగురు జాలర్లను కాపాడటంలో వీరోచిత పోరాటం చేసిన నౌకాదళ కోస్ట్ గార్డు పాలకొలను రమణారెడ్డి అభినందనీయుడని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, కాశినాయన మండల ఎంఈఓ మహమ్మద్‌షఫీ, రిటైర్డు వైద్యాధికారి మార్కారెడ్డి అన్నారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో గురువారం సాయంత్రం కోస్ట్‌గార్డు రమణారెడ్డికి జ్ఞాపిక అందచేసి, పూలమాల, శాలువతో సన్మానించారు. అత్యంత సాహసం చేసిన రమణారెడ్డిని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము మెడల్ అందచేయడం జిల్లాకు గర్వకారణమన్నారు. దేశ రక్షణకు అందరూ సిద్ధగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు నాయకులు సుబ్రమణ్యం, చంద్రహాసరెడ్డి, బాలరాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కలసపాడు : కోస్ట్ గార్డు రమణారెడ్డికి సీజీసీ మెడల్ దక్కడంతో పీఆర్ అండ్ ఆర్‌డీ ప్రభుత్వ మాజీ సలహాదారుడు నాగార్జునరెడ్డి, కొండపేట గ్రామస్థులు బుధవారం రమణారెడ్డి, ఆయన తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. నాగార్జునరెడ్డి మాట్లాడుతూ పేద రైతు కుటుంబంలో జన్మించిన రమణారెడ్డి తన ప్రాణాలను లెక్క చేయకుండా జాలర్లను విడిపించేందుకు పోరాడారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఎస్.నారాయణరెడ్డి, రోశిరెడ్డి, రామచంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లి, కొడుకులపై విచక్షణా రహితంగా దాడి


– కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు

ప్రొద్దుటూరు క్రైం : పొలంలోకి వెళ్తున్న మహిళతోపాటు ఆమె కుమారుడిపై విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటనలో దండు శ్రీనివాసులుపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. ప్రొద్దుటూరు మండలంలోని తాళ్లమాపురం గ్రామానికి చెందిన సాయిలక్ష్మికి అదే గ్రామంలో 80 సెంట్ల పొలం ఉంది. ఆమె పొలం పక్కనే వారి బంధువు దండు శ్రీనివాసులు పొలం ఉంది. ఈ నెల 26న సాయిలక్ష్మి, తన కుమారుడు శ్రీరాంను వెంట పెట్టుకొని పొలం వద్దకు వెళ్లింది. అప్పటికే అక్కడ ఉన్న శ్రీనివాసులు ఆమెను చూసి ఎక్కడికి పొలంలోకి వెళ్తున్నావని పరుష పదజాలంతో దూషించాడు. × నీ భర్తకు డబ్బులు ఇచ్చాం.. నీకు ఇంకెక్కడ భూమి ఉందిళ్ళ అని అన్నారు. అంతటితో ఆగక ఆమెను పొలంలోకి వెళ్లనీయకుండా జుట్టుపట్టుకొని లాగడంతో కింద పడిపోయింది. అంతేగాక పక్కనే ఉన్న కట్టె తీసుకొని ఆమెను చితకబాదాడు. సాయిలక్ష్మి గట్టిగా కేకలు వేస్తున్నా ఆగకుండా కాళ్లతో పొత్తి కడుపులో తన్నాడు. ఆమె కుమారుడు అడ్డు రాగా అతనిపై కూడా దాడి చేసిన శ్రీనివాసులు అక్కడి నుంచి పారిపోయాడు. ఈ దాడిలో తల్లి, కొడుకులకు గాయాలయ్యాయి. సాయిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ రాజు తెలిపారు.

రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీపై విచారణ

ప్రొద్దుటూరు రూరల్ : రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీపై గురువారం విచారణ చేపట్టినట్లు తహసీల్దారు గంగయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పార్టీ కార్యాలయం గతంలో వసంతపేటలోని 22/160 ఇంటిలో ఉండేదని, ప్రస్తుతం రాజేశ్వరీకాలనీలోని 19/280–148–1 ఇంటిలోకి మార్చబడిందని గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పార్టీ అభ్యర్థి 2009, 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నామినేషన్ వేశారని, ప్రస్తుతం క్రియాశీలకంగా ఉందని తన విచారణలో తేలిందన్నారు. పార్టీ రద్దు తాను ఎక్కడా ప్రకటించలేదని తెలిపారు. భారతీయ సధర్మ సంస్థాపన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పాతకోట వెంకటరెడ్డి మరణించినందున ఆయన కుమారుడు పాతకోట రామమోహన్‌రెడ్డికి నోటీసు అందించినట్లు తెలిపారు. వీరు సెప్టెంబర్ 8వ తేదీలోపు రాష్ట్ర ప్రధాన ఎన్నికల ప్రధాన కార్యక్రమంలో హాజరు కావాలన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి


సుమన్‌తేజ(19)

కడప అర్బన్: కడప నగరంలోని బాలాజీ నగర్ వినాయక మండపం వద్ద విద్యుత్ షాక్ తగిలి సుమన్‌తేజ(19) మృతి చెందారు. కడప తాలూకా ఎస్‌ఐ తులసీ నాగ ప్రసాద్‌కు యువకుడి తల్లిదండ్రులు ఆనందరావు, అరుణకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సుమతేజ తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అతడు ఇంటర్ వరకు చదువుకుని కేటరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 27న రాత్రి వినాయక చవితి పండుగ సందర్భంగా తనతోపాటు కేటరింగ్ పనులను నిర్వహించే స్నేహితుడు పిలవడంతో బాలాజీనగర్‌కు వెళ్లాడు. మండపం వద్ద తాను వర్షానికి తడిసిపోవడంతోపాటు, సంఘటనా స్థలంలో బాగా తడిచేరింది. ఈ క్రమంలో సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెట్టేందుకు సుమన్‌తేజ ప్రయత్నించారు. ఆ సమయంలోనే విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బద్వేల్ నియోజకవర్గాన్ని కడప జిల్లాలోనే కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వరరావు

బద్వేలు అర్బన్ : బద్వేల్ నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలో చేర్చాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకుని కడప జిల్లాలోనే కొనసాగించాలని బద్వేలు నియోజకవర్గ పరిరక్షణ సమితి అధ్యక్షుడు చీపాటి రాజేశ్వరరావు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక నాయకులు బి.నారాయణరెడ్డి కోరారు. స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన సమావేశంలో బుధవారం వారు మాట్లాడుతూ జిల్లాలోని అత్యంత వెనుక బడిన, ఎంతో చరిత్ర కలిగిన బద్వేల్ నియోజకవర్గాన్ని ఇక్కడి ప్రజల మనోభావాలను, ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకుండా అన్నమయ్య జిల్లాలోకి మార్చాలనుకోవడం సరికాదన్నారు. నియోజకవర్గంలోని కలసపాడు, కాశినాయన మండలాల నుండి రాజంపేటకు వెళ్లాలంటే వందల కిలో మీటర్లు ప్రయాణించాల్సి వస్తుందన్నారు. ఈ ప్రాంతంలో అధికంగా ఉన్న బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకుని బద్వేల్ నియోజకవర్గాన్ని కడప జిల్లాలో కొనసాగించాలని, లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, వీరబ్రహ్మేంద్రస్వామి జిల్లా సాధన సమితి అధ్యక్ష, కార్యదర్శులు బ్రహ్మారెడ్డి, చంద్రఓబుల్‌రెడ్డి, సీనియర్ దళిత నాయకులు పిచ్చయ్య, కేశవయ్య, నారాయణ, సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, ఏపీ వీఆర్ఏల సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగేశం పాల్గొన్నారు.

కాల్వలో పడిన గేదెలు.. కాపాడిన ఫైర్ సిబ్బంది


గేదెలను బయటికి తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని సుజుకి షోరూమ్ సమీపంలో బుధవారం ప్రమాదవశాత్తూ రెండు గేదెలు మురుగు కాలువలో పడ్డాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు అరగంట పాటు శ్రమించి గేదెలను బయటకు తీశారు. కొండారెడ్డివీధిలో నివసిస్తున్న పెంచల్ రెడ్డికి చెందిన మూడు గేదెలను మేతకు తీసుకెళుతుండగా నెల్లూరు రోడ్డులోని సుజుకి సమీపంలోని డ్రైనేజీ కాలువలో పడ్డాయి. గేదెల యజమాని వాటిని బయటికి తీసేందుకు స్థానికుల సహకారంతో గంటసేపు ప్రయత్నించినప్పటికీ సాధ్యపడలేదు. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఆఫీసర్ చంద్రుడు ఆధ్వర్యంలో లీడింగ్ ఫైర్‌మెన్ హరిక్రిష్ణ, ఫైర్‌మెన్లు పాములేటి నాయక్, మాబురెడ్డి, స్థానికులతో కలిసి అతికష్టం మీద గేదెలను బయటికి తీశారు. అయితే సంబంధిత డ్రైనేజీపై ఉన్న కల్వర్టును ఇటీవల తొలగించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోయారు.

గాండ్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : గాండ్ల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం పట్టణాధ్యక్షుడు గుండుమల్ల నాగయ్య పేర్కొన్నారు. స్థానిక ఆంధ్ర కేసరి రోడ్డులోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు 20 లక్షల మంది గాండ్ల కులస్తులు ఉన్నారని తెలిపారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు జీసీ పుల్లయ్య, సెక్రటరీ పాలూరు ప్రసాద్, కోశాధికారి మాదా లక్షుమయ్య, గౌరవాధ్యక్షులు గంగనపల్లె చిన్నసుబ్బయ్య, నల్లం నాగభూషణం, బచ్చల శ్రీనివాసులు పాల్గొన్నారు.

జిల్లాలో వర్షం

– అత్యధికంగా పోరుమామిళ్లలో 23.2 మి.మీ

కడప ఎడ్యుకేషన్ : అల్పపీడనం కారణంగా జిల్లా లోని పలు మండలాల్లో గురువారం ఉదయం వర్షం కురిసింది. పోరుమామిళ్లలో అత్యధికంగా 23.2 మిల్లీ మీటర్ల వర్షం కురవగా సిద్ధవటంలో 14, బద్వేల్‌లో 10.4, కాశినాయనలో 7.2, కడపలో 7, వీఎన్‌పల్లి, ఒంటిమిట్టలో 6.4, గోపవరంలో 5.2, బి.కోడూరులో 4.8, వల్లూరులో 4.6,అట్లూరులో 4.4, బి.మఠం, చెన్నూరు, కమలాపురంలలో 4.2, దువ్వూరు 1.4, చక్రాయపేటలో 1 మిల్లీమీటరు వర్షం కురిసింది.

మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి


జోనల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాగరాజు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ ప్రయాణీకులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు అన్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ కడప జోనల్ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించి పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఆర్టీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి గోపాల్‌రెడ్డి, గజలక్ష్మి, పీవీ.రమణారెడ్డి, ధనలక్ష్మి, ధర్మతేజ, సలాం, ప్రశాంతి, డిల్లీశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

మైదుకూరు : మండలంలోని వనిపెంట వద్ద గల ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మైదుకూరులోని సద్గురు సాయి ఫర్టిలైజర్స్, శ్రీనివాస ట్రేడర్స్, వనిపెంటలోని ఇర్షాద్ ఎంటర్ ప్రైజెస్, ఆంజనేయ ఫర్టిలైజర్స్, విజయలక్ష్మి ఫెర్టిలైజర్స్, వీరబ్రహ్మేంద్ర ట్రేడర్స్‌లో ఉదయం నుంచి తనిఖీలు చేశారు. ఎరువుల రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వాయిస్, సేల్స్ బిల్స్, స్టాక్ నిల్వలను పరిశీలించారు. వివరాలు నమోదు చేయడంలో లోపాలు గుర్తించి సద్గురు సాయి ఫర్టిలైజర్స్‌లో రూ.3.15 లక్షల విలువైన 8.75 మెట్రిక్ టన్నుల ఎరువులను, విజయలక్ష్మి ఫర్టిలైజర్స్‌లో రూ.2.47లక్షల విలువైన 7.5 మెట్రిక్ టన్నుల ఎరువులను అమ్మకుండా నిలుపుదల చేస్తూ నోటీసులు ఇచ్చారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ జి.శ్రీనివాసరావు, మైదుకూరు ఏడీఏ ఎం.కృష్ణమూర్తి, విజిలెన్స్ సీఐ ఎం.శివన్న, బాలగంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కైలాసగిరి కొండపై వేయి మొక్కలు


కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ, ఫారెస్టు సిబ్బంది

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల నుండి టేకూరుపేట పోవు దారిలో బండినరవ నందీశ్వరస్వామి దేవస్థాన ప్రదేశంలో కై లాసగిరి కొండపై గురువారం గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు కల్లూరు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో 40 మంది వేయి మొక్కలు నాటారు. ఫారెస్టు రేంజర్ రఘునాథరెడ్డి, బీట్ ఆఫీసర్లు కరుణాకర్, వెంకటరమణలు నేరేడు, రావి, వేప, ఉసిరి, మద్ది, మారేడు, వేపే, చింత మొక్కలు అందచేయడంతోపాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రేంజర్ మాట్లాడుతూ కైలాసగిరి కొండను పచ్చదనంతో నింపాలని, ఆలయాలను నిర్మించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బండినరవ సభ్యులు ఫణిరావు, వెంకటరెడ్డి, రామసుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, చిన్నయ్య, వెంకట్రామిరెడ్డి, గురుప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

జీవ శాస్త్రంపై అంతర్జాతీయ సదస్సు


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రవీంద్రనాథ్

కడప ఎడ్యుకేషన్ : కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి)లో సమగ్ర జీవశాస్త్రం మరియు ఔషధ శాస్త్రంపై గురువారం అంతర్జాతీయ సదస్సు జరిగింది. జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ జీవశాస్త్రంలో జరుగుతున్నటువంటి ప్రస్తుత పరిశోధనలు, వాటితో కలిగే ప్రయోజనాలను తెలిపారు. అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ తులసి మాట్లాడుతూ జీవశాస్త్ర పరిశోధనలతో మానవుల్లో వచ్చే వ్యాధులకు చికిత్స చేయడానికి వీలవుతుందని తెలిపారు. డాక్టర్ రాజేష్ కుమార్ ఈ వ్యర్థాల నిర్వహణపై, డాక్టర్ భూపేష్ ఆధునిక జీవ శాస్త్రం అభివృద్ధిపై, డాక్టర్ సంజయ్ గర్భాశయ క్యాన్సర్‌పై వివరించారు. సదస్సులో వీరనాగేంద్రకుమార్, డాక్టర్ రమేష్, డాక్టర్ పి.రవిశేఖర్, డాక్టర్ నీలయ్య, డాక్టర్ నాగేశ్వరరెడ్డి, డాక్టర్ మహేష్, డాక్టర్ జమాల్‌బాషా, డాక్టర్ రామచంద్ర, డాక్టర్ సావిత్రి, పి.మహేష్, పి.నవనీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.